క్లుప్తంగా

రైతులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. ఉదయం 9 గంటలకు గురజాల నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, రైతులు అందరు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఇంటి వద్ద నుంచి బయలుదేరి కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అన్నదాతకు అండగా ఉందాం తరలిరండి

మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి

రెంటచింతల: అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వైఎస్సార్‌సీపీ తలపెట్టిన నిరసనకు పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నాయకత్వంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు శుక్రవారం నరసరావుపేటకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని, ధాన్యానికి కనీస మద్దతు ధర, దళారీ వ్యవస్థను తొలగించాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు నరసరావుపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లడం జరుగుతుందన్నారు. అన్నదాతకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్త, నాయకుడు, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.

నూతన గ్రామ పంచాయతీగా విజయపురిసౌత్



విజయపురిసౌత్: నాగార్జున సాగర్‌లో అంతర్భాగమైన విజయపురిసౌత్‌ను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించినట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురువారం మాచర్ల టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సాగర్‌ను పంచాయతీ చేసుకోవాలని ఆ కాలనీ వాసులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. స్వపరిపాలన లేకపోవడం వలన సాగర్ వాసులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న నాగార్జునసాగర్ నూతన పంచాయతీ ఏర్పాటుతో అభివృద్ధి బాట పడుతుందన్నారు. సాగర్‌ను నూతన పంచాయతీగా ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వివాదాస్పద భూమి పరిశీలన



రెంటచింతల: మండలంలోని పాత పాలువాయి గ్రామానికి చెందిన ఓ రైతుకు సంబంధించి వివాదాస్పద భూమిని గురువారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పాత పాలువాయి గ్రామానికి చెందిన శ్రీనివాసాచారి పాలువాయి జంక్షన్ వద్ద సర్వే నెంబర్ 190లో ఉన్న తన 1.50 ఎకరాల పంట పొలంలో 20 నుంచి 25 సెంట్ల భూమిని ఆక్రమించి కొందరు కలిసి మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఈ నెల 4వ తేదీన సీఎంఓలో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కె.నగేష్, జిల్లా సర్వే ఏడీఈ భానుశ్రీ, ఆర్ఐ పల్లా రామకృష్ణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వి.ప్రసాద్ రావు, గ్రామ సర్వేయర్ ఎస్.రవీంద్రారెడ్డి తదితరులు భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులో నున్న వివరాలను పరిశీలించారు. వివాదస్పదమైన భూమి పూర్తి వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తహసీల్దార్ నగేష్ తెలిపారు.

ముమ్మరంగా వరి నూర్పిళ్లు

- ఎక్కువగా హార్వెస్టర్లతోనే వరి కోతలు
- ధాన్యం ఆరబెట్టేందుకు అనుకూలించని వాతావరణం
- కోసిన పంట వెంటనే అమ్ముతున్న వైనం
- దీంతో దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధర లేదు



కారెంపూడిలో వరి కోత కోస్తున్న హార్వెస్టర్

కారెంపూడి: మండలంలో వరి నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు కూడా వరి నూర్పిళ్లలో చాలా బిజీగా ఉన్నారు. అయితే వరి కోసి కల్లాలు చేస్తున్న దృశ్యాలు ఎక్కడా కానరావడం లేదు. అలా చేయడానికి కూలీలు దొరక్క రైతులంతా హార్వెస్టర్లపైనే ఆధారపడి వరి నూర్పిళ్లు కానిస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా వరి నూర్పిళ్లు పూర్తయ్యాయి.

గిట్టుబాటు ధర లేదు

రైతులకు వరి పంటకు సరైన గిట్టుబాటు ధర మాత్రం లభ్యం కావడం లేదు. కోసిన ధాన్యం వెంటనే తేమతో అమ్మితే బీపీటీ రకాలైతే 75 కిలోల బస్తా రూ.1,450 పలుకుతోంది. అదే జిలకర సన్నాలైతే గరిష్టంగా రూ.1,850 దాకా బయట మార్కెట్లో అమ్మకాలు జరుగుతున్నాయి. సాధారణ రకాలకు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రావాలంటే ధాన్యాన్ని బాగా ఆరబెట్టాలి. దానికి వాతావరణం అనుకూలంగా లేక వర్షం ఎప్పుడు పడుతుందోననే భయంతో పంటను రైతులు వెంటనే అమ్మేస్తున్నారు. ఎక్కువ మంది సన్న, చిన్నకారు రైతులు ఎరువులు పురుగుమందుల కొట్లలో బాకీలుండడంతో వారి ధాన్యాన్ని వారే కొనుగోలు చేస్తున్నారు. మండలంలో 25 వేల ఎకరాలలో ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. బురదలో కోసే చైన్ హార్వెస్టర్ అయితే గంటకు రూ.3,500, ఫోర్ వీల్ హార్వెస్టర్ అయితే గంటకు రూ.2,600 తీసుకుంటున్నారు. ఎకరం కోయడానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతోంది. హార్వెస్టర్లు దొరక్క సకాలంలో వరి కోయలేని పరిస్థితుల్లో చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



హార్వెస్టర్ నుంచి ట్రాక్టర్‌లోకి జాలువారుతున్న ధాన్యం



రాత్రి పూట కూడా ధాన్యాన్ని బస్తాలకు పడుతున్న కూలీలు

పశువుల మేత నేలపాలు

హార్వెస్టర్లతో వరి కోతలు జరుగుతుండడంతో వరి గడ్డి దాదాపు పనికి రాకుండా పోతోంది. పశువులకు నోటికాడ మేత నేలపాలు అవుతోంది. ఉన్న గడ్డిని అయినా కట్టలు కట్టించుకుందామంటే ఇటీవల తుపాను ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు వరి గడ్డి తడిసి పాడైపోయింది. ఇదిలా ఉంటే వరి దిగుబడులు కొందరికి పర్వాలేదనిపిస్తున్నాయి. మరి కొందరికి పెట్టిన పెట్టుబడులు మాత్రమే వస్తున్నాయి. శ్రద్ధ పెట్టి పండించిన వారికి తప్పితే కౌలు రైతులకు ఖరీఫ్ పంటలో మిగులు మాత్రం కన్పించడం లేదు. రబీ పంటలో మిగులు ఉంటుందనే ఆశతో రైతులున్నారు. ఎకరాకు 30 బస్తాలు పండిన రైతుకు పెట్టుబడి మాత్రమే వస్తోంది. పెట్టుబడులు పెరగడంతో చివరకు కష్టార్జితం కూడా రావడం లేదు.

దిగుబడులు ఆశాజనకం



వరి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. బీపీటీ రకాల సగటు దిగుబడి 35 బస్తాల దాకా ఉంది. ఎకరాకు 40 బస్తాల నుంచి అత్యధికంగా 50 బస్తాల దిగుబడి వచ్చిన వారు కూడా ఉన్నారు. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లుగా వ్యాపారులే కొంటున్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి అమ్మే వాతావరణ పరిస్థితులు లేకపోవడంతో వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే తేమతోనే అమ్ముతున్నారు. వ్యాపారులు కూడా కొంటున్నారు.

– బి.యలమందారెడ్డి, ఏవో, కారెంపూడి

వరి సాగు పెట్టుబడులు పెరిగాయి



నేను ఆరెకరాలలో వరి సాగు చేశాను. పురుగు మందులు వాడకుండా పంట పండించడం మొదటి నుంచి చేస్తున్నాను. కానీ ఈ ఏడాది సుడిదోమ దెబ్బకు మూడెకరాలలో పంటను నష్టపోయాను. పురుగు మందులు కొట్టకుండా వరి పంట పండించడం కష్టం. ఏదైనా 35 బస్తాల పైన పండితేనే రైతు కష్టానికి అంతంత మాత్రంగా మిగులు ఉంటుంది. అంతకన్నా తక్కువ దిగుబడి వస్తే పెట్టుబడులకే సరిపోతాయి. వరి సేద్యం కూడా వాణిజ్య పంటలతో సమానంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది.

– బొరిగొర్ల గురువులు, రైతు, కారెంపూడి

కంది పంట క్షేత్ర పరిశీలన

కారెంపూడి: కారెంపూడి, గురజాల, దాచేపల్లి మండలాల్లో వేసిన కంది పంటలను గుంటూరు లాంఫాం శాస్త్రవేత్తలు బుధవారం సాయంత్రం క్షేత్ర పరిశీలన చేశారు. ముఖ్యంగా శాస్త్రవేత్తలు నూతనంగా రూపొందించిన కంది రకం సౌభాగ్య 133–33 రకం సాగులో ఉన్న ప్రథమ శ్రేణి క్షేత్రాలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు రూపొందించిన నూతన వంగడం సౌభాగ్యను సాగు చేస్తున్న రైతులకు తగిన సస్యరక్షణ చర్యలను శాస్త్రవేత్తలు సూచించి వారికి ప్రోత్సాహకంగా ఉచితంగా పురుగు మందులు, పై పాటు అందించే బలం మందులను అందించారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులను సాధించవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. అపరాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.మోహన్‌రెడ్డి, కంది బ్రీడర్ డాక్టర్ కేవీ శివారెడ్డి, కంది కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ సాంబశివరావులు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో కారెంపూడి ఏఏఏ హరినాయక్, పలువురు రైతులు పాల్గొన్నారు.



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పునీత థామస్ అడుగుజాడలలో నడవాలి

ఫాదర్ సుధాకర్

తుమ్మకోట(రెంటచింతల): క్రీస్తు సూక్తులను ఆచరిస్తూ పునీత థామస్ క్రైస్తవులకు ఆదర్శంగా నిలిచారని ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడలలో నడిచి సమాజంలో నిజమైన క్రైస్తవులుగా జీవించాలని రె.ఫాదర్ సుధాకర్ (వైస్ ప్రొవిన్షియల్) అన్నారు. గురువారం తుమ్మకోట గ్రామంలో 124 సంవత్సరాల క్రితం నిర్మించిన పురాతనమైన పునీత థామస్ చర్చి ఆవరణలో నిర్మితమైన థామస్ గృహం 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విచారణ గురువులు మార్లై పవిత్రన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమిష్టి దివ్యపూజాబలిని ఆయన 32 మంది ఫాదర్లతో కలిసి సమర్పించి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలోనే తుమ్మకోట చర్చి అతి పురాతన మైందన్నారు. అపోస్తులు 12 మందిలో ఒకరైన థామస్ దేశంలో మొదటిసారి క్రీస్తు సువార్తను ప్రచారం చేశారని గుర్తుచేశారు. క్రీస్తు ఆరాధికులు ఇరుగు పొరుగు వారి పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని కోరారు. పవిత్ర సమిష్టి దివ్యపూజాబలిలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. ఈ వార్షికోత్సవంలో ఫాదర్లు, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



పునీత థామస్ చర్చి ఆవరణలో నూతన గృహం వద్ద ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

విద్యార్థులు ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాలి

మాచర్ల: విద్యార్థి దశ నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించే విధంగా ప్రతి సంవత్సరం విద్యార్థులకు జాగృతి పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద రామకృష్ణ మిషన్ స్థాపించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని ప్రతి స్కూలు, కాలేజీలో భారత జాతికి నా హితవు అనే పుస్తకం ఆధారంగా జాగృతి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద కలలుగన్న నవభారత నిర్మాణం జరగాలంటే క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకొని మహనీయుల అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. శ్రీ చైతన్య స్కూల్ హెచ్ఎం హరిణి మాట్లాడుతూ మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు జాగృతి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య టెక్నో స్కూల్ డీన్ అనిల్, ఇన్‌చార్జి శివకుమార్, ఉపాధ్యాయులు, సేవా సమితి సభ్యులు శ్రీనివాస్, లాల్ సాహెబ్, రవి పాల్గొన్నారు.



విజేతలతో మెట్టు గోవిందరెడ్డి

ప్రారంభమైన అమ్మవారి తిరునాళ్ల ఉత్సవాలు

గురజాల: పట్టణంలో వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారి 426వ తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి బియ్యం కొలత కార్యక్రమంతో ప్రారంభమై వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. మొదటి రోజు బియ్యంను కొలిచి మూటగట్టగా నాల్గవ రోజు బియ్యం విడుపు కొలతలో బియ్యం రెట్టింపు అవుతాయని భక్తుల నమ్మకం. గురువారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



మాచర్ల: కేసీపీ యాజమాన్యం, రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, కృష్ణవేణి, ఎస్‌కేబీఆర్, పల్నాడు జూనియర్ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి సుమారు 300 పైగా మొక్కలు నాటారు. కేసీపీ జనరల్ మేనేజర్ వి.వెంకట రమణ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత అన్నారు. డాక్టర్ రామకోటయ్య మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా వాతావరణ కాలుష్యం నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎ.రామకృష్ణారావు, బాలయ్య, వై.వెంకట్రామయ్య, శివభాస్కర్, పటాన్ నాగూర్ వలి, రోటరీ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, అన్నపురెడ్డి లక్ష్మి, రాధ, సత్యప్రసాద్, శివ మెడికల్ రామ్మూర్తి, కర్నాటి వాసు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు బైబిల్ క్విజ్

మాచర్ల: పట్టణంలో సమర్పణ చర్చి ఆవరణలో రాష్ట్రస్థాయి మెగా బైబిల్ క్విజ్ ఈ నెల 14న నిర్వహించనున్నట్లు కన్వీనర్ బ్రహ్మానాయుడు, ప్రసాద్, శంకర్ గురువారం తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా యువతలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుటకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు. బైబిల్‌లోని పలు అంశాలు, పత్రిక గ్రంథాలపై క్విజ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్‌నుంచి సీఐ మరియదాసు హాజరు అవుతున్నట్లు తెలిపారు. 6362218163 నంబర్‌కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ‘మీతో మేము’



పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రచార బోర్డు

పిడుగురాళ్ల: పట్టణ పోలీస్ స్టేషన్లో ‘మీతో మేము’ ప్రచార బోర్డును పోలీస్ శాఖ వారు ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు, ప్రజలకు కనిపించే విధంగా పోలీస్ స్టేషన్ ప్రవేశంలోనే ఈ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ బోర్డులో ప్రజలు ఆన్‌లైన్ మోసాలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సెల్‌ఫోన్‌లో తెలియని యాప్‌లు ఓపెన్ చేస్తే మొబైల్ నెంబర్‌కు లింక్ ఉన్న బ్యాంక్ ఖాతాలోని నగదు మాయం అవ్వకుండా, ఆన్‌లైన్ మోసాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఇరుగుపొరుగు వారితో స్నేహభావంతో ఉండాలని, గొడవలకు పాల్పడితే వారి జీవితాలు జైలుపాలవుతాయని, సైబర్ నేరాలపై అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురైతే 1930కు కాల్ చేసి సంప్రదించాలని, ఇలా పలు విషయాలపై ఈ ‘మీతో మేము’ ప్రచార బోర్డులో పలు అంశాలపై స్క్రోలింగ్ వస్తుంది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారు కొంత సమయం వేచి ఉండి ప్రచార బోర్డులోని అంశాలను నిలబడి చదువుతున్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



పిడుగురాళ్ల: తొలగించిన గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర వలంటీర్ల సంఘం నాయకులు ఎస్‌కే బాషా డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆర్వో మోహిదీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్‌కే బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు వలంటీర్లను కొనసాగిస్తామని, ఒక్కో వలంటీర్‌కు రూ.10 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తుందని ఆయన విమర్శించారు. వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ స్మారక సమితి నాయకులు ఈదర గోపిచంద్, వై.మధు, సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు, వలంటీర్ల సంఘం నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

పిడుగురాళ్ల: మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, 11వ పీఆర్‌సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలని, 2023 నవంబర్, డిసెంబర్ నెలల పెండింగ్ హెల్త్ అలవెన్స్ విడుదల చేయాలని, చనిపోయిన కార్మికులకు చెల్లించాల్సిన పరిహారం వెంటనే ఇవ్వాలని, వారి స్థానంలో తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, టీఎల్ఎఫ్ కింద తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి రూ.21 వేల వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, సంక్రాంతి కానుక రూ.1,000 అమలు చేయాలన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, సబ్బులు, చెప్పులు, నూనె ఇవ్వాలని, ఎన్ఎంఆర్ కార్మికలను ఆప్కాస్‌లో చేర్చి రూ.21 వేల వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు మొగిలి ప్రతాప్, కాంద్రగుంట యలమంద, కొప్పూరి విజయ్, సురేష్, పద్మ, శ్యామ్ కోటి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ ఈఈలు వెంకటేశ్వరరావు, సింగయ్య

కారెంపూడి: విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక తనిఖీ బృందాలు కారెంపూడి మండలంలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. మండలంలోని కారెంపూడి, ఒప్పిచర్ల, రెడ్డిపాలెం, చినగార్లపాడు, పేటసన్నెగండ్ల, పెద కొదమగుండ్ల గ్రామాలలో విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహించడం జరిగిందని, చట్ట విరుద్ధంగా విద్యుత్ శాఖ నిబంధనలను ఉల్లంఘించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 127 మందిని గుర్తించి వారికి రూ.10.95 లక్షల జరిమానా విధించడం జరిగిందని ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, డీపీఈ ఈఈ ఎస్.సింగయ్య తెలిపారు. ప్రతి ఇల్లు, షాపులో విద్యుత్ మీటరు అలాగే దానికి సీలు ఉండేలా వినియోగదారులు చూసుకోవాలని అవి పాడైపోతే వెంటనే విద్యుత్ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి తెలపాలని వారు కోరారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారి సమాచారం 9440812263, 9440812360 నంబర్లకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. డీఈఈలు కె.రవికుమార్, ఎం.శ్రీనివాసరావు, ఏఈలు కె.కోటేశ్వరరావు, చంద్రశేఖర్, జి.వీ రాంజనేయులు, ఆపరేషన్ డీఈఈలు, పలు మండలాల ఏఈల ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక బృందాలు తనిఖీలను నిర్వహించాయి.

ఆలయ భూములకు పట్టాదారు పాస్‌బుక్‌లు మంజూరు చేయాలి



రామాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్



పశర్లపాడులో మాట్లాడుతున్న ఈఓ రామిరెడ్డి

ఈఓ రామిరెడ్డి

రెంటచింతల: ఆలయ భూములకు పట్టాదారు పాస్‌బుక్‌లను మంజూరు చేయాలని మండల ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని పశర్లపాడు గ్రామంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా నీటివనరుల శాఖ సహాయ అధికారి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఈఓ రామిరెడ్డి పాల్గొని మాట్లాడారు. పశర్లపాడు గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి, సీతారామ స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన మొత్తం 17.90 ఎకరాల భూములకు పట్టాదారు పాస్‌బుక్‌లను రెవెన్యూ అధికారులు మంజూరు చేయాలని కోరారు. ప్రత్యేక అధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 45 రోజులలో సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. 12 అర్జీలు అందజేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ పిన్నెం బ్రహ్మయ్య తెలిపారు. ఈ సదస్సులో వీఆర్వో తిక్కా లింగయ్య, సర్వేయర్ బాల సైదులు, గోళ్ల వెంకట నారాయణ, కావూరి నాగయ్య, నల్లబిరుదు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 9 అర్జీలు

మాచవరం: మండలంలోని మల్లవోలు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 9 అర్జీలు అందినట్లు తహసీల్దారు క్షమారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలం ఆన్‌లైన్, పట్టాదారు పాసు పుస్తకాలు, పొలం సవరణలకు సంబంధించి దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

మాచర్ల రూరల్: రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిష్కరించి రైతులకు తగు సమాధానాన్ని అందించేందుకే ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి గబ్రూనాయక్ తెలిపారు. గురువారం మండలంలోని రాయవరం గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఈ సదస్సులో భూములకు సంబంధించే కాకుండా ఇన్‌కం, క్యాస్ట్, పింఛన్, ఇతర ఏ సమస్యలైనా అర్జీలందించాలని కోరారు. 32 అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బత్తుల వాణి, ఆర్ఐ భాస్కర్, సర్వేయర్ జింకల ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.



రాయవరంలో అర్జీలను స్వీకరిస్తున్న డీఎల్‌డీవో గబ్రూనాయక్, తహసీల్దార్ వాణి

దాచేపల్లిలో 8 అర్జీలు

దాచేపల్లి : మండలంలోని రామాపురం, శ్రీనగర్ గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ కుటుంబరావుకు రామాపురం నుంచి 6, శ్రీనగర్‌లో 2 అర్జీలు రైతులు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.నాగిరెడ్డి, ఎంపీటీసీలు ఎ.కాశీరెడ్డి, వెంకటరెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

బడుగు బలహీన వర్గాల పక్షపాతి సాంబశివరావు

మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో పీడిత బడుగు బలహీన వర్గాల పక్షాన విప్లవ పోరాటాలు చేసి అమరుడైన సాంబశివరావు సేవలు మరువలేమని ప్రజాతంత్ర ఉద్యమం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. పట్టణ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు సాంబశివరావు మృతిని పురస్కరించుకొని గురువారం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, విప్లవ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి మాచర్ల ప్రాంతంలో ఎన్నో సమస్యలకు పరిష్కారాన్ని కనుగొన్న సాంబశివరావు ఉద్యమ స్ఫూర్తి ఆదర్శమన్నారు. చివరి వరకు విప్లవ పంథాలోనే జీవితాన్ని కొనసాగించి అనారోగ్యంతో మృతి చెందటం బాధాకరమన్నారు. సీపీఎం పార్టీ చేపట్టిన పార్లమెంటరీ విధానాలను విభేదించి 1967లోనే సాంబశివరావు సీపీఐ ఎంఎల్ ఆవిర్భావం నుంచి పీపుల్స్ వార్ పార్టీ, మావోయిస్టు పార్టీ ఆవిర్భాల వరకు విప్లవ ఉద్యమం వైపు నిలబడి ప్రజల పక్షాన ఎన్నో ఉద్యమాలు చేశారని రైతు సంఘం నాయకులు కోలా నవజ్యోతి అన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు సాంబశివరావు మృతిని పురస్కరించుకొని మాట్లాడారు. విప్లవ రచయితల రాష్ట్ర మహాసభల నిర్వహణ, పల్నాడులో మావోయిస్టు స్థూపాల నిర్వహణలో ఆయన సేవలు అమూల్యమన్నారు.